సాక్షి మెదక్

బుధవారం : 19 : జూలై : 2023



కోహీర్‌కు మెగా వాటర్‌షెడ్
ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎం కెఎస్‌వై) పథకం కింద కోహీర్ మండలానికి మెగా వాటర్‌షెడ్‌ను కేటాయించారు. 8లో



ఎమ్మార్సీ.. సమస్యల నిలయం
మండల కేంద్రం టేక్మాల్ వనరుల కేంద్రం (ఎంఆర్సీ కార్యాలయం)లో మౌలిక నదుపాయాలు లేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో

రేపు జాబ్‌మేళా
మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని ఐటీఐ సెంటర్‌లో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.రామరాజు తెలిపారు. ఎస్‌బిఐ క్రెడిట్‌కార్డు సంస్థలో బ్రాంచ్ రిలేషన్ ఎగ్జిక్యూటీవ్, టెలీకాలర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ పూర్తిచేసి, 21 నుంచి 32ఏళ్ల వయసు వారు అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9000937805 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఐదు ప్రాజెక్ట్‌లను పంపించాలి

మెదక్ కలెక్టరేట్: ఇన్‌స్పైర్ మనాక్‌కు ప్రతీ పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్ట్‌లను పంపించాలని చేయాలని ప్రొఫెసర్ డీఈఓ రాధాకిషన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇన్‌స్పైర్ ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో ఐడియా కాంపిటీషన్ బాక్స్‌లను ఏర్పాటు చేసి, ఉత్తమమైన ఐదు ప్రాజెక్ట్‌లను ఇన్‌స్పైర్ వెబ్‌సైట్‌లో గాని ఇన్‌స్పైర్ మనాక్ యాప్‌లో ఆగస్టు 31లోపు అప్‌లోడ్ చేయాలన్నారు.

చారిత్రక అంశాలపై అవగాహన అవసరం



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పెద్ద శంకరంపేట(మెదక్): పురాతన ఇతిహాస చారిత్రక అంశాలతో కూడిన కథలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీస్తాయని తిరుమల తిరుపతి దేవస్థానం ఉమ్మడి జిల్లా ధర్మ ప్రచార పరిషత్ బాధ్యుడు లక్ష్మీనారాయణ శర్మ అన్నారు. మంగళవారం మండలంలోని సరస్వతీ శిశు మందిర్‌లో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శిశు మందిర్, సంస్కార్ విద్యాలయం, సాయి చైతన్య పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీటీడీ బాధ్యులు రాంరెడ్డి, రాగం సిద్దేశ్వర్, ప్రధానాచార్యులు వీరప్ప, సంస్కార్ విద్యాలయం కరెస్పాండెంట్ సీతారామరావు, ఆచార్యులు జైహింద్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షంలోనూ దీక్ష



గొడుగులు పట్టుకొని దీక్ష చేస్తున్న నేతలు

రామాయంపేట(మెదక్): డివిజన్ సాధన కోసం అఖిల పక్ష నాయకులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి దీక్ష 114 రోజులకు చేరుకున్నాయి. ఉదయం నుంచి భారీ వర్షం కురిసినా అఖిలపక్షం ప్రతినిధులు గొడుగులు పట్టుకొని దీక్షలో కూర్చున్నారు. ప్రభుత్వం వెంటనే డివిజన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరించాలి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

తూప్రాన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నార్సింగి గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. 13 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పనికి తగిన వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమ, ఎనిమిది గంటల పని దినం, వారాంతపు, పండగ సెలవులు అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏటా మూడు జతుల యూనిఫాం, చెప్పులు, సబ్బు, నూనెలు ఇవ్వాలని కోరారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 21న కలెక్టరేట్ వద్ద నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా కార్యదర్శి అసిఫ్, సత్యనారాయణ, ఎల్లం, రాజు, యాదగిరి, నాగరాజు, మహేష్, స్వామి, సరిత, కిష్టయ్య, బిక్షపతి, అంజయ్య, బాలమణి, శోభ, నరసమ్మ, ఎల్లమ్మ, ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడి

మెదక్ కలెక్టరేట్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అందని యూనిఫాం



నిజాంపేట ఉన్నత పాఠశాలలో సివిల్ డ్రెస్‌లో విద్యార్థులు

- స్కూల్స్ ప్రారంభమై నెలవుతున్నా.. జాడలేని ఏకరూప దుస్తులు
- చాలా బడుల్లో ఒకే జత పంపిణీ
- కొన్ని చోట్ల అది కూడా ఇవ్వని వైనం
- సివిల్ డ్రెస్‌ల్లోనే పాఠశాలలకు

విద్యార్థుల మధ్య పేద, ధనిక తారతమ్యాలు తొలగించేందుకు ఏటా విద్యార్థులకు యూనిఫాంలను పంపిణీ చేస్తోంది. నెలరోజులు గడిచినా జిల్లాలో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు నేటికీ పూర్తిస్థాయిలో యూనిఫాంలు అందలేదు. దీంతో విద్యార్థులు సివిల్ డ్రెస్‌లోనే తరగతులకు హాజరవుతున్నారు.

మెదక్‌జోన్: సర్కారు పాఠశాలల్లో విద్యను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో లక్ష్యం నెరవేరడంలేదు.

- జిల్లాలో 924 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్‌స్కూల్స్, కేజీబీవీల్లో 86,958 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.
- ప్రతీ విద్యార్థికి ఏడాదికి రెండు జతల దుస్తుల చొప్పున 1,73,916 యూనిఫాంలు అవసరం ఉంటాయి.
- కాగా ఇప్పటివరకు జిల్లాలో 87,656 మాత్రమే పంపిణీ చేశారు. మరో 86,260 జతల యూనిఫాంలు అందాల్సి ఉంది.
- నిజాంపేట మండలంలో 31 ప్రభుత్వ పాఠశాలల్లో 2,213 విద్యార్థులకు గాను 4,426 యూనిఫాంలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,382 మందికి మాత్రమే అందాయి.
- ఇందులో హైస్కూల్స్‌లో 6 నుంచి 10 తరగతి విద్యార్థులు 831 మంది ఉండగా వారికి ఒక జత కూడా అందలేదు.
- చిన్నశంకరంపేట మండలంలో 5,430 మంది విద్యార్థుల్లో 2,247 మందికి ఒక్కో జత ఇచ్చారు. 3,183 మందికి విద్యార్థులకు అసలే అందలేదు.
- అల్లాదుర్గంలో 124 మంది విద్యార్థుల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవం రోజున 10 మందికి మాత్రమే ఒక్కో జత అందించి చేతులు దులుపుకున్నారు.
- రామాయంపేట మండలంలో 4,887 మంది విద్యార్థుల్లో 3,509 మందికి మాత్రమే ఒక్కో జతచొప్పున అందించారు.

తయారీ ఆలస్యం..

- జిల్లా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు ఒక్కో జతకు రూ.50 చొప్పున మహిళా సంఘాలకు అప్పగించారు.
- జిల్లాలోని విద్యార్థులకు సరిపడా క్లాత్‌ను మహిళా సంఘాల సభ్యులకు అప్పగించినా. పాఠశాలల ప్రారంభం నాటికి దుస్తులు సిద్ధం కాలేదు.
- ఆలస్యం అవుతుండడంతో మహిళా సంఘాల నుంచి క్లాత్‌ను తీసుకొని హైదరాబాద్, జహీరాబాద్‌లో కొన్ని ఏజెన్సీలకు అప్పగించి కుట్టిస్తున్నట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు.
- మూడురోజుల క్రితం విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి విద్యార్థుల యూనిఫాం పంపిణీపై మాట్లాడుతూ.. వారంలో విద్యార్థులందరికీ రెండు జతల దుస్తులను అందించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు యూనిఫాంలను త్వరగా అందిస్తారో లేదో వేచి చూడాలి.

వారంలో అందిస్తాం



విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించాం. వారు ఆలస్యం చేయడంతో సమయానికి అందించలేకపోయాం. దుస్తులను మరోచోట సిద్ధం చేయిస్తున్నాం. వారంలో అందరికీ పంపిణీ చేస్తాం.

– రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్

'కొండా' జీవితం ఆదర్శం

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

మెదక్ మున్సిపాలిటీ: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటాలు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ విగ్రహాన్ని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం చేనేత సహకార సంఘం అధ్యక్షుడు బొద్దుల సంతోష్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు జయరాం అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు మంత్రి పదవిని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. జిల్లా కేంద్రంలో పద్మశాలీ సంఘం భవానికి ఎకరం భూమిని కేటాయిస్తున్నట్లు తెలిపారు. మార్కండేయ ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య మాట్లాడుతూ.. కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. పార్లమెంట్‌లో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, దీనికోసం బీసీలలోని అన్ని కులాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు హరికృష్ణ, ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పద్మశాలి సంఘం డివిజన్ అధ్యక్షుడు బొద్దుల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు రామచందర్, కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.



ముసురుకున్న వాన

మెదక్‌జోన్: జిల్లాలో సోమవారం రాత్రి మొదలు మంగళవారం రోజంతా ముసురు వాన కురిసింది. 17 మండలాల్లో మధ్యస్తంగా, నాలుగు మండలాల్లో సాధారణంకన్నా తక్కువగా వర్షపాతం నమోదైంది. అత్యధికంగా హవేళిఘనాపూర్ మండలం నాగాపూర్‌లో 44.0 మి.మీటర్లు, మెదక్ జిల్లా కేంద్రంలో 42.0 మి.మీటర్లుగా నమోదైంది. మూడో స్థానంలో చిన్నశంకరంపేట 40.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. శివ్వంపేట మండలం కొత్తపేట్‌లో 16.8 మి.మీ.లు, నర్సాపూర్ మండలం చిప్పతుర్తిలో 12.3 మి.మీటర్లు, పాపన్నపేట మండలం లింగాయిపల్లి 6.మి.మీ వర్షం కురిసింది. మనోహరాబాద్, శివ్వంపేట, టేక్మాల్ మండలం మినహా దాదాపు అన్ని మండలాల్లో వర్షం కురిసింది.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

సమన్వయంతో పని చేయాలి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పల్లె దవాఖానా, మనఊరు– మనబడికి సంబంధించిన పనులపై ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పల్లె దవాఖానాల ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని, అవసరమైతే స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. అల్లాదుర్గం, రంగంపేట్, వెల్దుర్తి పీహెచ్‌సీల మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, పనులు ప్రారంభం కాని చోట అధికారులు దగ్గరుండి లక్ష్యం మేరకు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చందనాయక్, డీపీఓ సాయిబాబా, పంచాయతీ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈఓ రాధాకిషన్, సంబంధిత శాఖ ఇంజినీర్లు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత బీఆర్‌ఎస్‌దే

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికి రైతువేదికలో ఉచిత విద్యుత్‌పై నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు కరెంట్ గోసలను చూశారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక నిరంతర ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంట్ చాలని చెబుతున్నాడని, అభివృద్ధిని ఓర్వలేక సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. విద్యుత్, రైతు బీమా, రైతుబంధుతోపాటు ధాన్యం కొనుగోలు చేస్తూ సీఎం కేసీఆర్ రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ త్వరలోనే ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో కౌడిపల్లి, చిలప్‌చెడ్ ఎంపీపీలు రాజునాయక్, వినోదరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, రైతుబంధు సమితి అధ్యక్షుడు సార రామాగౌడ్, సర్పంచ్‌లు కురుమ శేఖులు, లక్ష్యానాయక్, పద్మకిష్టయ్య, సాయిలు, నరహరి, రమేష్, నాయకులు అమర్‌సింగ్, నర్సింగారావు, శ్యాంసుందర్‌రావు, కాంతారావు, నాయికోటి లింగం, సత్తయ్య, కుతుబొద్దీన్, సలీం, గణేష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

రాహుల్‌ను విమర్శించే స్థాయి లేదు

మంత్రి కేటీఆర్‌పై టీపీసీసీ కమిటీ సభ్యుడు ఆంజనేయులు ధ్వజం



మాట్లాడుతున్న మామిళ్ల ఆంజనేయులు

మెదక్‌జోన్: రాహుల్ గాంధీ గొప్పనాయకుడని, ఆయనను విమర్శించే స్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ కమిటీ సభ్యుడు మామిళ్ల ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండు పర్యాయాలు ప్రధానమంత్రి అవకాశం వచ్చినా స్వీకరించకుండా ఇతరులకు అవకాశం కల్పించారన్నారు. సోనియా గాంధీ చొరవతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, రాష్ట్రమే ఏర్పడకుంటే కేటీఆర్ ఎక్కడ ఉండేవాడో గుర్తుచేసుకోవాలన్నారు. రోజుకు 8 నుంచి 10 గంటలు మాత్రమే కరెంటు ఇస్తూ.. 24గంటలు ఇస్తున్నామని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గూడూరు ఆంజనేయులు గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మెతుకు సీమలో మెరుగైన జీవనం

- పేదరికం తగ్గుముఖం
- 2015–16లో ఉమ్మడి జిల్లాలో 17.87 శాతం
- 2019–21లో మెదక్‌లో 9.34, సంగారెడ్డిలో 7.09, సిద్దిపేటలో 3.39శాతం
- నీతి అయోగ్ నివేదికలో వెల్లడి
- 2019–21 ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5 ఆధారంగా రిపోర్టు

సాక్షి, సిద్దిపేట: బహుళముఖ పేదరిక సూచీలకు సంబంధించి నీతి అయోగ్ తాజాగా వెల్లడించిన వివరాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నట్లుగా వెల్లడైంది. ఈ మేరకు నేషనల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్–ఏ ప్రోగ్రెస్ రివ్యూ 2023 పేరిట నీతి అయోగ్ నివేదిక విడుదల చేసింది. సరైన జీవన ప్రమాణాలు సాధించడంలో సమాజంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించడం, వాటికి పరిష్కార మార్గాలు చూపించడం ఈ నివేదిక ముఖ్య ఉద్దేశం. ఈ నివేదికలో పేర్కొన్న అంశాలు... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించే పథకాల్లో కీలకపాత్ర పోషిస్తాయి.

పన్నెండు అంశాల్లో..

నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ –2023 వివరాలతో నీతి అయోగ్ విడుదల చేసిన రిపోర్టు ప్రకారం జాతీయ బహుముఖీయ పేదరిక సూచీ(ఎంపీఐ)లోని విద్య, ఆరోగ్యం, జీవన ప్రమాణాలు వంటి 12 అంశాలు పరిగణనలోకి తీసుకోవడంతో పాటు 2019–21 జాతీయ కుటుంబ సర్వే(ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–5) ఆధారంగా నీతి అయోగ్ ఈ నివేదిక రూపొందించింది.

- 2015–16లో విభజనకు ముందు మెదక్ జిల్లాగా ఉన్నప్పుడు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు ఇలా అనేక విభాగాల్లో పేదరికం అనుభవిస్తున్న వారి సంఖ్య జిల్లా జనాభాలో 17.87టశాతం ఉండేది. 2019– 21లో జిల్లాల విభజన తర్వాత మెదక్ 9.34 శాతం, సంగారెడ్డి 7.09, సిద్దిపేట 3.39 శాతం ఉంది.
- ఇటీవల ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలు, పరిశ్రమల ఏర్పాటు, మిషన్‌భగీరథ, కేసీఆర్ కిట్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, మెరుగైన వైద్యం, అంగన్‌వాడీలు, పాఠశాల ద్వారా పౌష్టికాహారం తదితర పథకాలు క్షేత్రస్థాయిలో చివరి లబ్ధిదారుడి వరకు చేరుకోవడం గడిచిన ఆరేళ్లలో ఎక్కువైంది. ఫలితంగా పేదరికం తగ్గుముఖం పట్టినట్టుగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

డిప్యూటేషన్ల జాతర.. నిబంధనలకు పాతర

ప్రజాప్రతినిధుల లేఖలకు ప్రాధాన్యం

- హాట్ కేక్‌గా నిజాంపేట సెంటర్
- 10 మంది టీచర్లకు మార్పు
- పరిశీలనలో మరో 14 దరఖాస్తులు



పాఠం బోధిస్తున్న టీచర్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): మండలంలో మల్లంపేట ప్రాథమికోన్నత పాఠశాల ఇటీవలే ఉన్నత పాఠశాలగా మార్చారు. 10 తరగతుల్లో 295 విద్యార్థులు, 8మంది టీచర్లు ఉన్నారు. తరగతికో టీచర్ చొప్పున కేటాయించినా మరో 2 తరగతులు ఖాళీగా ఉంటాయి. ఇక్కడ మహిళా టీచర్లు ఎక్కువ. కాగా ఇక్కడి నుంచి ఇటీవల సిద్దిపేటకు చెందిన ఓ టీచర్‌ను నిజాంపేట మండలానికి డిప్యూటేషన్‌పై పంపారు. ఇందుకు ఓ ప్రజా ప్రతినిధి సిఫారసు చేసినట్లు సమాచారం.

- పాఠశాల అవసరాలు కాకుండా, టీచర్ల ప్రయోజనాలకు అనుగుణంగా డిప్యూటేషన్లు కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి.
- జిల్లా ప్రజా ప్రతినిధుల సిఫారసుతో విద్యాశాఖలో డిప్యూటేషన్ల జోరు కొనసాగుతుంది.
- జూన్‌లో 7 డిప్యూటేషన్లు జరుగగా, ఇటీవల మరో ముగ్గురికి చేయగా, మరో 14 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది.
- జిల్లాలో చాలా మంది సిద్దిపేట జిల్లాకు చెందిన టీచర్లు పని చేస్తున్నారు. స్థానికంగా ఉండే వారు చాలా తక్కువ.
- దాదాపు అందరు రోజుకు 100 కి.మీ పైగా ప్రయాణం చేసి విధులకు హాజరు అవుతున్నారు.
- సాధారణ బదలీలు, ప్రమోషన్ల కేసు కోర్టులో ఉండడంతో దూరా భారం తగ్గించుకునేందుకు డిప్యూటేషన్ పైరవీలు ప్రారంభించారు.
- రేగోడ్, అల్లాదుర్గం, శంకరంపేట, టేక్మాల్, పాపన్నపేటలకు చెందిన టీచర్లు డిప్యూటేషన్ కోసం ప్రజా ప్రతినిధులను ఆశ్రయిస్తున్నారు.
- అకస్మాత్తుగా ఇతర చోటుకు టీచర్లు వెళ్లడంతో ఉన్న పాఠశాలలో టీచర్ల కొరత ఏర్పడి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.
- పాపన్నపేట మండలం నుండి ఒకరు, టేక్మాల్ మండలం బర్దిపూర్ నుండి మరో టీచర్ నిజాంపేట మండలానికి, కొల్చారం మండలం నుంచి మెదక్ టౌన్‌కు ఓ టీచర్ డిప్యూటేషన్‌పై వెళ్లారు.
- సబ్జెక్ట్ అవసరాన్ని బట్టి కాకుండా సొంత అవసరాలు, ప్రయోజనాలపై వీటిని చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.
- నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్లు చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అంటున్నారు.
- ఈ విషయమై డీఈఓ రాధాకృష్ణను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేరు.

అడ్డదారి బదిలీలు సరికాదు



నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల బదిలీలు చేయడం సరికాదు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా అత్యవసరమైతేనే బదిలీలు చేపట్టాలి. ఇష్టారీతిన డిప్యూటేషన్ చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– కృష్ణ, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి

నిబంధనల ప్రకారం చేయాలి



టీచర్ల బదిలీలు, ప్రమోషన్లు నిబంధనల మేరకు చేపట్టాలి. సొంత మండలాల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నా.. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇతర చోట్లకు పంపడం సరికాదు.

– సంగయ్య, టీపీటీఎఫ్ అధ్యక్షుడు

కోహీర్‌కు మెగా వాటర్ షెడ్

- రూ.10.41కోట్లు మంజూరు
- 4,733 హెక్టార్లలో పనులు
- ఎనిమిది గ్రామాల రైతులకు లబ్ధి


షెడ్ నిర్మాణ పనులకు సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కోహీర్(జహీరాబాద్): నీటి సంరక్షణ, నిర్వహణ ద్వారా వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం బృహత్ ప్రణాళికను రూపొందించింది. ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన(పీఎం కెఎస్‌వై) పథకం ప్రవేశ పెట్టి వాటర్ షెడ్‌ల నిర్మాణం చేపట్టి రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తోంది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు మంజూరైన ఏకైక వాటర్ షెడ్ పథకాన్ని కోహీర్ మండలానికి కేటాయించి అమలు చేస్తోంది.

కోహీర్ దక్కన్..

కోహీర్ మండలం దక్కన్ పీఠ భూమిపై ఎత్తైన ప్రదేశంలో విస్తరించి ఉంది. మండలానికి ఇతర ప్రాంతాల నుంచి నీరు వచ్చే అవకాశం లేదు. మండలంలో కురిసిన వర్షపు నీరు ఇతర ప్రాంతాలకు చేరుతుంది. వాగులు, వంకలు లేకపోవడంతో ఉన్న కొన్ని చెరువులు సైతం పూర్తిస్థాయిలో నిండని పరిస్థితి నెలకొంది. తద్వారా మండలంలో భూగర్భ జలాల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. నానాటికి భూగర్భ జలాలు తరిగి పోవడంతో చాలా వరకు గ్రామాల్లో వ్యవసాయ బావులు పూర్తిగా నిరుపయోగమయ్యాయి. మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బావులు 40 మీటర్ల లోతు ఉన్నప్పటికిని వ్యవసాయానికి సరిపడ నీటి లభ్యత లేదంటే పరిస్థితి ఇట్టే అర్థం చేసుకోవచ్చు. బోరు బావుల సక్సెస్ రేటు తక్కువగానే ఉంటోంది. మండలంలో నానాటికి తరిగిపోతున్న భూగర్భ జలాల మట్టాలను పెంపొందింప చేయడానికి కేంద్ర ప్రభుత్వం మెగా వాటర్‌షెడ్ అమలుకు శ్రీకారం చుట్టింది.

రూ.10.41 కోట్లు మంజూరు

పీఎం కెఎస్‌వై పథకం ద్వారా మండలంలోని ఎనిమిది గ్రామాలలో వాటర్‌షెడ్ నిర్మాణ పనులను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వం రూ.10,41,26,000లను మంజూరు చేసింది. మండలంలోని పీచేర్యాగడి, పర్సపల్లి, బడంపేట, రాజనెల్లి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, కొత్తూర్(కె), ఖానాపూర్ గ్రామాల పరిధిలో 4,733 హెక్టార్ల భూమిని మెగా వాటర్‌షెడ్ పరిధిలో చేర్చి అభివృద్ధి చేయడానికి సంకల్పించారు.

ప్రత్యేక నియామకాలు

మెగా వాటర్ షెడ్ నిర్మాణపనులను పర్యవేక్షించడానికి ఇద్దరు అధికారులను, ఇద్దరు జూనియర్ ఇంజనీర్లను, నలుగురు టీఏలను, మరో నలుగురు టీఓలను నియమించారు. ఈ అధికారులను రెండు బృందాలుగా ఏర్పాటు చేసి విధులను అప్పగించారు. ప్రస్తుతం మండలంలోని ఆయా గ్రామాలలో సామాజిక ఆర్థిక స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్నారు. సహజవనరుల యాజమాన్య పనులను గుర్తించి వినియోగదారుల బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో వాటర్‌షెడ్ నిర్మాణ పనులను చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు. వాటర్‌షెడ్ అందుబాటులోకి వస్తే ఆయా గ్రామాలతోపాటు పక్కనున్న గ్రామాలలో సైతం భూగర్భ జలాలు పెరిగి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు



మా గ్రామశివారులో వాగులు వంకలు, చెరువులు లేక భూగర్భ జలాలు నానాటికి ఇంకిపోతున్నాయి. 30 మీటర్లకు పైగా తవ్విన బావులు సైతం నీరు ఎండిపోయి నిరుపయోగమౌతున్నాయి. సాగునీటి పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. వ్యవసాయదారులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మెగా వాటర్‌షెడ్ నిర్మాణంతో భూగర్భ జలాలు అభివృద్ధి చెంది రైతుల స్థితిగతుల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం

– సుదర్శన్‌రెడ్డి, రైతు, సజ్జాపూర్

త్వరలో పనులు ప్రారంభం



కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఏకైక మెగా వాటర్‌షెడ్ జిల్లాలోని కోహీర్ మండలానికి రావడం హర్షించదగ్గ విషయం. వాటర్ షెడ్ నిర్మాణానికి అవసరమగు సర్వే పనులు ప్రస్తుతం చురుగ్గా కొనసాగుతున్నాయి. త్వరలో పూర్తి స్థాయిలో పనులు ప్రారంభమౌతాయి. ప్రతిష్టాత్మకమైన మెగా వాటర్‌షెడ్ పనులను నాణ్యత లోపం లేకుండా నిర్వహించి రైతులకు పూర్తి స్థాయిలో ఉపయోగ పడేలా శాయశక్తుల కృషి చేస్తాం.

– సునందరావు, ఏపీఓ, కోహీర్ మండలం

వాటర్‌షెడ్ ప్రధాన లక్ష్యం

వాటర్‌షెడ్ ప్రధాన లక్ష్యం పరుగెత్తే నీటి ఓరవడిని తగ్గించి నడిపించడం, నీటిని ఆపడానికి కట్టల నిర్మాణ పనులు చేపట్టడం, ఆగిన నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందిండం ప్రధాన లక్ష్యం. భూగర్భ జలాలను పెంపొందించడానికి ప్రధానంగా ఎత్తైన ప్రదేశాలలో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడానికి వీలుగా వాలుకు అడ్డంగా కందకాల తవ్వకాలు చేపట్టి వర్షపు నీటి ప్రవాహపు వేగాన్ని తగ్గించడంతో పాటు భూమి కోతను అరికడతారు. కయ్యలకు అడ్డంగా రాతి కట్టడాలు నిర్మించి వరద నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తారు. చెక్కుడ్యాములు, ఊట చెరువులను నిర్మించి వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలను పెంపొందించడానికి కృషి చేస్తారు. ఇందుకుగాను వాటర్‌షెడ్ నిర్మాణ పనులకు గాను మంజూరైన నిధులలో 47 శాతం నిధులను ఖర్చు చేస్తారు. రైతుల వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందింప చేయడానికి 15 శాతం, వారికి జీవనోపాదులను కల్పించడానికి మరో 15 శాతం నిధులను ఖర్చు చేస్తారు. ఎంట్రీ పాయింట్ యాక్టివిటీ (ప్రాదేశిక కార్యక్రమం) సోలార్‌లైట్లు అమర్చడం, తాగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు, బస్సు షెల్టర్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం రెండు శాతం నిధులను కేటాయిస్తారు. వ్యవసాయదారుల్లో సామర్థ్యం, ఉత్పాదకతను పెంపొందించడానికి అవసరమగు శిక్షణలు, క్షేత్ర సందర్శనలు నిర్వహించడానికి మూడు శాతం నిధులను వెచ్చిస్తారు. పరిపాలన మరియు నిర్వహణ ఖర్చుల నిమిత్తం 10 శాతం, పర్యవేక్షణ మూల్యాంకనం కోసం 2 శాతం. క్వాలిటీ కంట్రోల్ ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ ఆడిట్ కోసం 3 శాతం, క్రోడికరణ కోసం మరో 3 శాతం సహజ వనరుల పెంపు, మరమ్మత్తుల కోసం 2 శాతం నిధులను ఖర్చుచేయనున్నారు.

క్లుప్తంగా

సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదు

నర్సాపూర్ రూరల్: చిన్నచింతకుంట సర్పంచ్ బుర్ర సురేశ్ గౌడ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చిన్న చింతకుంట గ్రామానికి చెందిన దళితుడు గుడ్డి రాములు అదే గ్రామంలోని సర్వే నంబర్ 39/అ/6లోని 2 ఎకరాల భూమిలో కొబ్బరి, ఆయా రకాల పంట సాగు చేసుకుంటున్నాడు. అట్టి భూమి వద్దకు సర్పంచ్ అనుచరులు గుడ్డి రాములు సాగు చేస్తున్న పంటను ధ్వంసం చేశారు. అంతేకాక అతన్ని కులం పేరుతో దూషించారు. దీంతో రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాటాడుతున్న ముగ్గురిపై కేసు

మిరుదొడ్డి(దుబ్బాక): పేకాట ఆడుతున్న స్థావరంపై మంగళవారం దాడి చేసినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ..అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన ఎల్లన్నగారి దుర్గారెడ్డి, దోమ రాంరెడ్డి, దోమ రామిరెడ్డిలు పేకాట ఆడుతుండగా ఆ స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.2,750 నగదుతో పాటు మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ శివారుల్లో గానీ, ఇళ్లల్లో, ఫాంహౌజ్‌ల్లో, బహిరంగ ప్రదేశాల్లో పేకాటతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే డయల్ 100, లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్‌రూం 8712667100కు సమాచారం చేరవేయాలన్నారు.

హత్య కేసులో ఐదేళ్ల జైలు

పెద్దశంకరంపేట(మెదక్): హత్య కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించినట్లు జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు జడ్జి పి.లక్ష్మీశారద మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి..పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీలో నివాసం ఉంటున్న ఎల్లయ్య 2019, జూలై 20న ఇంటి వద్ద ఉండగా నాందేడ్ వినోద్ బంధువుల అమ్మాయిని తిట్టాడని ఎల్లయ్యపై దాడి చేశాడు. దీంతో ఎల్లయ్య చనిపోయాడు. ఎల్లయ్య భార్య దుర్గమ్మ అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేరాన్ని విచారించిన కోర్టు నాందేడ్ వినోద్‌ను దోషిగా గుర్తించి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,500 జరిమానా విధించి శిక్షను ఖరారు చేసింది. కేసు విచారణలో కృషి చేసిన అల్లాదుర్గం సీఐ జార్జ్, ఇన్వెస్టిగేషన్ అధికారి రవీందర్‌రెడ్డి, కోర్టు లైజనింగ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


గేదెల కళేబరం

చిన్నశంకరంపేట(మెదక్): తెగిపడిన విద్యుత్ వైర్లు తగిలి మంగళవారం గేదెలు మృతి చెందాయి. మండలంలోని మిర్జాపల్లి గ్రామానికి చెందిన ర్యాల నర్సింహులు పశువులను పొలం వద్ద మేతకు తీసుకెళ్లాడు. పశువులు మేత మేస్తూ ముందుకెళ్లే క్రమంలో అప్పటికే తెగిపడిన విద్యుత్ ఎల్‌టీ వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. రైతు నర్సింహులు విషయం గమనించి వెనక్కు రావడంతో అతనికీ ప్రమాదం తప్పింది.

యువకుడి అదృశ్యం

జహీరాబాద్ టౌన్: మండలంలోని హోతి(బి) గ్రామానికి చెందిన సిరిగ మొగులప్ప(37) కనిపించకుండా పోయాడు. జహీరాబాద్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లిన మొగులప్ప తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన అతని భార్య సుధారాణి బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని పేర్కొన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఆది, సోమ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 26 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా జడ్జి 20 మందిలో ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, ఇద్దరికి రూ.3వేలు, నలుగురికి రూ.5వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: మండలంలోని పస్తాపూర్‌కు చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జహీరాబాద్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పస్తాపూర్‌కు చెందిన సూర్యపేట లక్ష్మణ్ మంగళవారం గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కనే ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఆత్మహత్యకు సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. భార్య అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉరేసుకొని ఫొటో గ్రాఫర్..

దుబ్బాకరూరల్: ఉరేసుకొని ఫొటో గ్రాఫర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ గంగారాజు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గెరిగంటి శ్రీకాంత్(32)ఫొటో గ్రాఫర్‌గా పని చేసే వాడు. అప్పులు ఎక్కువ కాడంతో తాగుడుకు బానిసైయ్యాడు. ఈ క్రమంలో తాను చనిపోతున్నానని భార్యకు ఫోన్ చేసి తెలిపాడు. దీంతో ఆమె సోమవారం రాత్రి తన మరిది స్వామిని తీసుకుని పొలం వద్దకు వెళ్లింది. అక్కడ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. మృతుని భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అదనపు కట్నం తేవాలని..


వివరాలు సేకరిస్తున్న సీఐ కృష్ణ


భవాని (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అదనపు కట్నం కోసం భార్యను గొంతు నులిమి భర్త హత్య చేశాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా, నిజాంపేట మండలం చల్మెడ గ్రామానికి చెందిన మంగళపల్లి రేణుక, తిరుమలయ్య దంపతుల కుమార్తె భవాని (21)ని సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన పూస చంద్రకళ, శంకరయ్య దంపతుల చిన్న కుమారుడు కనకరాజుకిచ్చి కట్నకానుకలతో 13 నెలల క్రితం వివాహం జరిపించారు. వారి కాపురం కొంత కాలం సజావుగా సాగింది. ఐదు నెలలుగా గొడవపడుతున్నారు. దీనికి తోడు భార్య భవాని అంటే ఇష్టం లేదని కనకరాజు చెప్పేవాడు. తరచూ ఆమెను అదనపు కట్నం తీసుకురావాలని చిత్రహింసలు పెట్టేవాడు. రెండు మూడు సార్లు కులపెద్దలు పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. ఈ క్రమంలో భర్త పెట్టే ఇబ్బందులను భరించలేక ఇటీవల పుట్టింటికి వెళ్లింది. ఆరు రోజుల క్రితం ఇరు కుల పెద్దలు మళ్లీ పంచాయితీ నిర్వహించి ఇద్దరికీ నచ్చజెప్పారు. ఇంతలో వారి మధ్య ఏం జరిగిందో తెలియదు. మంగళవారం తెల్లవారు జామున భార్య గొంతు నులిమి హత్య చేసి పారిపోయాడు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ కృష్ణ, తహసీల్దార్ ఉదయశ్రీ, మిరుదొడ్డి, దుబ్బాక ఎస్‌ఐలు శ్రీధర్‌గౌడ్, మహేందర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంతో వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం భవాని మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన..

భార్యను చంపిన కనకరాజును అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని మృతురాలి బంధువులు పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని బంధువులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆగ్రహించిన బంధువులు నిందితుడిని అరెస్ట్ చేయకుండా మృతదేహానికి పోస్ట్ మార్టానికి ఎలా తరలిస్తారని సీఐతో మృతురాలి బంధువులు వాగ్వివాదానికి దిగారు. నిందితుడిని త్వరలో అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడంతో శాంతించారు. సుమారు గంట పాటు సాగిన ఆందోళనతో మిరుదొడ్డి, గజ్వేల్ రోడ్డుకిరువైపులా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. నిందితుడు కనకరాజు పరారీలో ఉన్నాడని సీఐ కృష్ణ తెలిపారు.

జోరుగ వర్షాలు..

సంగారెడ్డి టౌన్: జిల్లాలో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం సంగారెడ్డిలో మురికి కాలువలన్నీ జామై పోవడంతో మురికి నీరంతా రోడ్లపై పారింది. సంగారెడ్డితో పాటు వివిధ మండలాలు, గ్రామాలలో వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది.

ఝరాసంగంలో..

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మంగళవారం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటువివిధ గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. రోడ్డుకి ఇరువైపులా ఉన్న గుంతలలో వర్షపు నీరు నిలవడంతో పాటు రహదారులపై గోతులు ఏర్పడ్డాయి. ఉదయం నుంచి వర్షం కురవడంతో ఇండ్ల నుంచి జనం బయటికి రాలేకపోయారు.

దత్తగిరిలో శ్రావణమాస పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బుధవారం మాతృశ్రీ అనసూయ మాత ఆధ్వర్యంలో ఉదయం గోపూజ, ఆశ్రమ ఆవరణలోని జ్యోతిర్లింగాల వద్ద ఏకాదశి రుద్రాభిషేకం, దత్తాత్రేయ స్వామి వారికిఅభిషేకం, పాదపూజ, మహా మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్ర సహిత దత్త యజ్ఞం, హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణ మాత, వైదిక పాఠశాల ఆచార్యుడు శివ శంకర్ స్వామి, అర్చకులు శ్రీపాద స్వామి, వైదిక పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భయాందోళనకు గురి చేస్తే చర్యలు తీసుకోవాలి


క్షుద్ర పూజలు చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆలయాల కమిటీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీ మైసమ్మ, ముత్యాల పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో క్షుద్ర పూజలు చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలయాల కమిటీ సభ్యులు గట్టయ్య, జెల్ల పద్మ, సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు పసుపు, గవ్వలు వదిలి వెళ్లారని, దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. మూడు సంవత్సరాలుగా ఇక్కడ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నామని అది చూసి ఓర్వలేక ఎవరైనా ఇలా చేశారేమోనని వారు అనుమానం వ్యక్తం చేశారు. కాలనీలో పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులు సంఘటనా స్థలికి వచ్చి పరిశీలించారన్నారు. కమిటీ సభ్యుల్లో ఒకరైన జెల్ల పద్మ ఇంటి దగ్గర కొద్ది రోజుల క్రితం ఇటువంటి దృశ్యాలు కనిపించాయని చెప్పారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు లక్ష్మి, పద్మ శ్రీ, భవాని, పద్మ, తిరుపతి, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

చేర్యాల(సిద్దిపేట): మండలపరిధిలోని ఓ గ్రామంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన యువకుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి జనసంచారం లేని ప్రదేశానికి తీసుకెళ్లి యువకుడు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. అక్కడి నుంచి తప్పించుకున్న బాలిక ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో సంఘటనలో..

మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమించమని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సదరువ్యక్తికి ఇదివరకే వివాహమైనప్పటికీ బాలికను ప్రేమిస్తున్నానని, తనను ప్రేమించాలని వెంటపడుతుండడంతో బాలిక కుటుంబ సభ్యులకు చెప్పింది. వెంటనే వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆశ చూపి దోచేస్తున్నారు..

- రూ.9.27లక్షలు పోగొట్టుకున్న బాధితులు

సిద్దిపేటకమాన్: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రూ.9,27,000లు దోచుకున్నారు. పోలీసులు, అధికారులు ఈ విషయంలో అవగాహన కల్పిస్తున్నప్పటికీ ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాటలు నమ్మి బ్యాంకు, ఏటీఎం, ఓటీపీ వివరాలు నమోదు చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చెప్పే మాయ మాటలకు ఆశపడి మోసపోతున్నారు. మంగళవారం జరిగిన సైబర్ మోసాల గురించి సీపీ శ్వేత విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

బ్యాంక్ అధికారులమని చెప్పి..

భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు సందీప్, నిశాంత్ పేర్లతో బ్యాంక్ మేనేజర్లమంటూ ఐడీ కార్డులు చూపి పరిచయం చేసుకున్నారు. ముందు వేసుకున్న పథకం ప్రకారం బాధితుణ్ని నమ్మించారు. తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చన్నారు. దీంతో వారి మాటలు నమ్మిన బాధితుడు బ్యాంకు, ఓటీపీ వివరాలు నమోదు చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రూ.6,66,558లు డ్రా చేసుకున్నారు. రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి డబ్బులు వస్తాయన్నారు. మూడ్రోజుల తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో చేసేదేమి లేక తను మోసపోయినట్టుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు స్పందించి రూ.47,422 ఫ్రీజ్ చేశారు.

రెట్టింపు లాభం వస్తుందని..

గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో తక్కువ పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందనే ఆశతో ఆన్‌లైన్‌లో ప్రకటన చూసి గుర్తు తెలియని వ్యక్తికి రూ.10వేలు పంపించాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు ఖాతాలో ఉన్న రూ.7వేలు ఫ్రీజ్ చేశారు.

పార్ట్ టైం జాబ్ పేరిట..

చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో పార్ట్ టైం జాబ్ ప్రకటన చూసి అందులో ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి సూచించిన విధంగా ఉద్యోగ నిమిత్తం ముందుగా కొంత మొత్తం డబ్బులు చెల్లించాలని సూచించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి రూ.10వేలు పంపించాడు. అనంతరం ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో బాధితుడు మోసపోయినట్లుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశాడు. వెంటనే వారు స్పందించి బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.10వేలు ఫ్రీజ్ చేశారు.

బ్యాంక్ ఖాతా అప్‌డేట్ అంటూ..

ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి బ్యాంక్ అధికారులమని, మీ ఖాతా అప్‌డేట్ చేయాలంటూ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. బ్యాంకుఖాతాకు పాన్‌కార్డ్ లింక్ చేయాలని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు తన పాన్ కార్డు వివరాలతో పాటు తన సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ వివరాలు తెలియజేశాడు. వెంటనే తన ఖాతా నుంచి రూ.28,779 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో తను మోసపోయినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ఐ ఫోన్ గెలుచుకున్నారంటూ..

కోహెడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి దుబాయ్ జమ్‌జమ్ ఎలక్ట్రికల్ చోటాబాయ్ బడాబాయ్ నుంచి మీరు ఐ ఫోన్ గెలుచుకున్నారంటూ వాట్సప్‌కు మెసేజ్ వచ్చింది. ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా సెల్‌ఫోన్ పంపించడానికి ఎయిర్‌పోర్ట్ ఛార్జీలు, ఇతర ఛార్జీల నిమిత్తం డబ్బులు చెల్లించాలని తెలిపాడు. మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి రూ.1,68,000 పంపించాడు. దీంతో తను మోసపోయినట్టు గుర్తించాడు.

లోన్ మంజూరైందంటూ..

రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి ప్రైవేటు సంస్థ ఎగ్జిక్యూటీవ్‌గా పరిచయం చేసుకొని మీకు లోన్ మంజూరైందని తెలిపాడు. లోన్ డబ్బులు ఖాతాలో జమ కావాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఛార్జీలు చెల్లించాలని తెలిపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తికి ఆన్‌లైన్‌లో రూ.4,500లు పంపించాడు. తర్వాత మరిన్ని డబ్బులు పంపించాలని గుర్తు తెలియని వ్యక్తి తెలుపగా బాధితుడు అనుమానంతో 1930కు ఫిర్యాదు చేయగా స్పందించిన వారు బాధితు డు పంపిన ఖాతాలో ఉన్న రూ.4,500 ఫ్రీజ్ చేశారు.

బిగ్ బజార్‌లో కిరాణం పేరుతో..

సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో బిగ్ బజార్‌లో కిరాణం ఆఫర్ అనే ప్రకటన చూసి అందులో ఉన్న లింకు ఓపెన్ చేసి ఎస్‌బిఐ క్రెడిట్ కార్డు ద్వారా రూ.999లు పంపించాడు. అనంతరం బాధితుడి ఖాతాలో ఉన్న రూ.39,600 డెడిట్ అయినట్లు మెసేజ్ రావడంతో అనుమానంతో జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఏసీబీ అధికారినంటూ బెదిరింపు ఫోన్

- త్రీటౌన్ పీఎస్‌లో ఫిర్యాదు

సిద్దిపేటఅర్బన్: ఏసీబీ అధికారినంటూ బెదిరింపులకు పాల్పడిన ఘటనపై ఆలస్యంగా కేసు నమోదైంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జూలై 30వ తేదీన పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావుకి అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అవినీతి నిరోధక శాఖ అధికారులమంటూ ఫోన్ చేసిన నిందితుడు తన వివరాలు చెప్పాలని బెదిరింపులకు గురిచేశాడు. ఈ విషయాన్ని అదేరోజు ఉన్నతాధికారులకు చెప్పాడు. జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు ఫిర్యాదు మేరకు సీఐ భానుప్రకాశ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీ కొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు దాటుతున్న వృద్ధుడిని కారు ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గుర్తు తెలియని సుమారు 65 సంవత్సరాల వృద్ధుడు రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతుండటంతో ఓ మహిళ రోడ్డు దాటించింది. తిరిగి ఆ వృద్ధుడు ముప్పిరెడ్డిపల్లి వైపునకు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో తూప్రాన్ నుంచి మేడ్చల్ వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విగ్రహావిష్కరణకు తరలిన పద్మశాలీలు



విగ్రహావిష్కరణకు తరలిన పద్మశాలి సంఘం నాయకులు

నిజాంపేట(మెదక్): స్వతంత్ర సమర యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఆవిష్కరణకు మంగళవారం మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెదక్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీలు మురళీ, గణేశ్, శ్రీనివాస్, సతీశ్, మహేశ్, శంకరయ్య, బాలనర్సు, పాండురంగం, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

దళితబంధు అందరికీ ఇవ్వాలి



టేక్మాల్(మెదక్): దళితబంధు గ్రామంలోని దళితులందరికీ ఇవ్వాలని మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలోని మాల, మాదిగ వర్గాల వారు సర్పంచ్ స్వరూపకు వేర్వేరుగా వినతి పత్రం అందించారు. మంగళవారం ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. దళితబంధు జాబితాల్లో అవకతవకలు జరుగుతున్నాయని, ఇస్తే అర్హులైన వారందరికీ ఇవ్వాలని కోరారు. గ్రామంలో అందరికీ దళితబంధు ఇవ్వలేనిపక్షంలో పథకాన్ని నిలిపివేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని సర్పంచ్ తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కొల్చారం(నర్సాపూర్): ఉపాధ్యాయ, విద్యారంగా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల తపస్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, శ్రీకాంత్ అన్నారు. మంగళవారం రంగంపేట ఉన్నత పాఠశాలలో తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీలతో పాటు డీఏ బకాయిలను ఒకేసారి చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తపస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, నవీన్, సతీశ్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అశోక్ ఉపాధ్యాయులు అరుణ, కవిత, నరేశ్‌చారి, ఉమా మహేశ్వరీ, రజిత, ఏసుకుమారి తదితరులు పాల్గొన్నారు

నియామకం

శివ్వంపేట(నర్సాపూర్): మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా దంతన్‌పల్లికి చెందిన ములుగు నాగేశ్వర్‌రావు నియమితులయ్యారు. బీఆర్ఎస్ సీనియర్ నేతగా పనిచేస్తున్న నాగేశ్వర్‌రావుని అందరి ఆమోదంతో నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రైతు సమన్వయ సమితిగా నియమించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆమోదంతో నియామకపత్రం అందజేయనున్నారు.

సన్మానం

రామాయంపేట(మెదక్): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎంపీ హన్మంతరావును మంగళవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి సన్మానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో హన్మంతరావు నివాసంలో కలిసిన శశిధర్‌రెడ్డి ఆయనతో పార్టీ విషయాలపై చర్చించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి కిషన్, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, కేశవులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ.. సమస్యల నిలయం

- మౌలిక సదుపాయాలు కరువు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులు



టేక్మాల్ ఎంఆర్‌సీలో నిరుపయోగంగా మరుగుదొడ్లు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ వనరుల కేంద్రం (ఎంఆర్సీ కార్యాలయం)లో అనేక సమస్యలున్నాయి. అన్ని పాఠశాలకు ఆదర్శంగా ఉండాల్సిన వనరుల కేంద్రంలోనే మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. దీంతో సమావేశాలకు వచ్చే ఉపాధ్యాయులు, వివిధ పనులకోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు అనేక అవస్థలు పడుతున్నారు. అయినా అధికారులేవరు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి వసతి లేదు

- టేక్మాల్ మండలంలో 37 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత, 7 ఉన్నత, ఒక మోడల్, ఒక కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. యో
- అన్ని పాఠశాలల్లో కలిపి సుమారుగా 4200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి బోధించేందుకు 177 మంది ఉపాధ్యాయులు ఉండగా 50 శాతం వరకు మహిళా ఉపాధ్యాయులు ఉంటారు.
- ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా విద్యాబోధన చేసిన మార్పులతో పాటూ పలు అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు కొన్నేళ్ల క్రితం లక్షల రూపాయాలు వెచ్చించి, మండల వనరుల కేంద్రాన్ని నిర్మించింది.
- భవనాన్ని నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వం ఆ భవనానికి నేటికి నీటి వసతిని కల్పించలేదు. అవగాహన సదస్సులకు వచ్చే ఉపాధ్యాయులతో పాటూ ఇతర పనులకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఎంతో ఇబ్బంది పడుతున్నారు.
- ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాల ద్వారా వారానికి ఒకమారు టేక్మాల్ ఎమ్మార్సీ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సమావేశాలు సుమారుగా 2–3 గంటల పాటూ జరుగుతుంటాయి.
- సమావేశాలకే కాకుండా విద్యార్థుల పుస్తకాలకు, దుస్తువులకు, ఆడిట్ తదితర పనులపై కార్యాలయానికి వస్తునే ఉంటారు.
- కనీసం తమకు తాగునీరు కూడా దొరక్క ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అత్యవసర సమయాల్లో ఉపాధ్యాయులు తమ పనులను బహిర్భూముల్లోనే కానిచ్చేస్తున్నారు.
- పురుష ఉపాధ్యాయుల సంగతి ఎలాగున్నా మహిళా టీచర్ల పరిస్థితి మరింతగా వర్ణనాతీతంగా మారింది.
- అన్ని పాఠశాలలకు ఆదర్శంగా నిలవాల్సిన ఎమ్మార్సీ కార్యాలయంలోనే ఇలా సమస్యలుంటే మండలంలోని పాఠశాలలోని మౌలిక సదుపాయాలపై అధికారులు ఎలా దృష్టి సారిస్తున్నారని చెప్పకనే చెప్పవచ్చు.
- కార్యాలయం చుట్టు ముళ్ల పొదలు నిండిపోయాయి. కార్యాలయం ముందున్న మినీట్యాంక్‌కు సరిగ్గా ట్యాంపులు లేకపోవడంతో నీరంతా వృథాగా పోతూ ఆవరణ పూర్తిగా బురదమయంగా మారుతోంది.
- మండలానికి ఇన్‌చార్జ్ ఎంఈఓ కావడంతో చుట్టపుచూపుగా వస్తు, ఇలా ఇచ్చి అలా వెళ్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి.
- దీంతో సమస్యలు విలయతాండవం చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.
- ఇకనైనా సంబంధిత జిల్లా అధికార యంత్రాగం చొరవ తీసుకొని ఎమ్మార్సీలో కనీస సదుపాయాలను కల్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

సీత్లా సంబురాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సీతారం పంచాయతీ జగ్య తండాలో బుధవారం గిరిజనులు సీత్లా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షాలు సంమృద్ధిగా కురిసి రైతులు పాడి పంటలతో సంతోషంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి రోగాలు రాకుండా ఉండాలని పూజలు నిర్వహించినట్లు తండా పెద్దలు తెలిపారు. వేడుకల్లో తండా యువతి, యవకులు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు. సీత్లా వేడుకలకు జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రవినాయక్ రూ. 6 వేల నగదు అందజేశారు.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన ముసురు, మధ్యలో రెండు మూడు జల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లోని మడుల్లో నీరు చేరింది. ఇప్పటికే వరి నాట్లు వేసిన రైతులు నీటిని దిగువ భాగాల్లోకి వదిలివేశారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటలకు 22 మి.మీ. వర్షం నమోదు కాగా ఆ తర్వాత నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 27మీ.మీ వర్షపాతం నమోదు అయింది. వర్షంతో ఇటు వరి పంటకు అటు పత్తి పంటకు మేలు చేకూరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలో 28 మి.మీ. కురిసిన వర్షం నమోదు అయిందని మండల గణాంకాల శాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో తక్కువ వర్షపాతం నమోదు అయిందన్నారు. అయినప్పటికీ, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో 19.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు చిరుజల్లులతో కూడిన వర్షం పడుతూనే ఉంది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు.

అల్లాదుర్గం(మెదక్): మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. తెల్లవారు జాము నుంచే వర్షం పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాఠశాలలకు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

చిన్నశంకరంపేట(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహేందర్ కోరారు. చిన్నశంకరంపేటలో 26.4 మి.మీ. వర్షంపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే వర్షంలో విద్యుత్ సమస్యలు వస్తే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, స్వయంగా ఎవరు కూడా రిపేరు చేయవద్దని కోరారు.

రేగోడ్(మెదక్): వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం సుచించారు. రానున్న నాలుగు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసిందని, గురు, శుక్రవారాల్లోనూ భారీగా వర్షాలు పడతాయని తెలిపిందని చెప్పారు. బుధవారంలోగా బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంపై గాలులతో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుందన్నారు. మరోవైపు జార్ఖండ్ దక్షిణ ప్రాంతంపై 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు మరో ఉపరితల ఆవర్తనం ఉందని, వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పాత గోడలు, ఇళ్లు కూలే ప్రమాదం ఉందని చెప్పారు. విద్యుత్ స్తంభాలు, ఎలక్ట్రిసిటీ వస్తువులను తడిగా ఉన్నప్పుడు తాకరాదని ఎస్ఐ కోరారు.